
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
5 జిల్లా వార్తలు
ఆదివారం 9 జూన్ 2024



● ప్రతి పల్లె పసుపుమయమే..! ● 77 గ్రామాల్లో 68 గ్రామాల్లో టీడీపీకి మెజారిటీ ● కల్లూరు 16 వార్డుల్లోనూ హవా ● కాటసాని అక్రమాలపై విసిగెత్తిన ప్రజలు

● గౌరు చరితకు జైకొట్టిన జనం






అరాచక రాజ్యంలో.. అద్భుత ఫలితం

కబ్జాల ఇలాకాలో కష్టాల సుడిగండం.. ఎటు చూసినా అల్లరి మూకల అరాచకాల పర్వం.. ఎప్పుడు ఎవరు దౌర్జన్యానికి దిగుతారో తెలియని దైన్యం. అటువంటి నియోజకవర్గంలో అద్భుత ఫలితం.. బలమైన క్యాడర్ లేకున్నా మంచితనమే ఆమె ఆయుధమైంది. అనేక ఇబ్బందుల్లోనూ ప్రజలను అంటిపెట్టుకొని ఉండడమే తన విజయానికి సోపానమైంది. బలమైన వర్గం తమకు ఉందంటూ జబ్బలు చరుచుకున్న ప్రత్యర్థిని ఆమె మంచితనమే మట్టి కరిపించింది. సార్వత్రిక ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ విజయ ఢంకా మోగించింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాలతోపాటు కల్లూరు 16 వార్డుల్లో సైతం టీడీపీ సత్తా చాటింది. పసుపు జెండా ఎగురవేయాలని ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అభిమానుల కోరిక గౌరు చరిత ఆధ్వర్యంలో నెరవేరింది. 40,500 ఓట్ల ఆధిక్యంతో ఆమె విజయం సాధించింది.

కర్నూలు, జూన్ 8: పాణ్యం నియోజకవర్గంలో పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, కల్లూరు మండలాలతో 16 అర్బన్ వార్డులు ఉన్నాయి. పాణ్యం మండలంలో 18 గ్రామాలు, గడివేములలో 17 గ్రామాలు, ఓర్వకల్లులో 22 గ్రామాలు, కల్లూరులో 20 గ్రామాలతోపాటు 16 వార్డులు ఉన్నాయి. ప్రతి మండలంలో మూడు గ్రామాలు మినహాయించి 68 గ్రామాల్లో టీడీపీ విజయబాట ఎగురవేసింది. పాణ్యం మండలంలో పిన్నాపురం, తొగర్చేడు, అనుకూరు, గడివేములలో ఒండుట్ల, బిలకలగూడూరు, ఆళ్లగడ్డ, ఓర్వకల్లులో మీదివేముల, కొంతలపాడు, చింతలపల్లె, కల్లూరులో గోకులపాడు, పుసులూరు, కొంగనపాడు మినహాయించి అన్ని గ్రామాల్లోనూ అత్యధికంగా మెజారిటీ సాధించింది. కల్లూరు మండలం ఉలిందకొండలో, ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లెలో, గడివేముల మండలం గని గ్రామంలో, పాణ్యం మండలం పాణ్యం గ్రామాల్లో వైసీపీ కంటే టీడీపీ అత్యధిక శాతం మెజారిటీ సాధించింది.

బలమైన క్యాడర్ ఉన్నా...

పాణ్యం నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా వైసీపీ, కాంగ్రెస్‌లు ఆధిక్యాన్ని కనబరుస్తున్నాయి. పాణ్యం నియోజకవర్గంలో టీడీపీకి బలమైన క్యాడర్ ఉన్నా సరైన నాయకత్వం లేకపోవడంతో కొంత వెనుకబడాల్సిన పరిస్థితి ఉండింది. పునర్విభజనకు ముందు 1983, 1999లో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. ఆ తర్వాత ఎప్పుడూ కూడా టీడీపీ గెలుపొందలేదు. 1999లో టీడీపీ తరఫున బిజ్జం పార్థసారథిరెడ్డి పోటీ చేసి అత్యధిక మెజారిటీ గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో టీడీపీకి దూరం కావడం, పార్టీ తరపున పోటీ చేసేందుకు ఎవరూ కూడా ముందుకు రాకపోవడం వంటి కారణాలతో టీడీపీకి కొంత లోటు కనిపించింది. 2009లో బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పాణ్యం తరపున బరిలో నిలిచిన ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన నియోజకవర్గానికి కూడా దూరమయ్యారు. 2014లో ఏరాసు ప్రతాప్‌రెడ్డి పాణ్యం టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమి చవి చూసి అయన కూడా నియోజకవర్గానికి దూరమయ్యారు. 2019లో గౌరు చరిత వైసీపీ నుంచి టీడీపీలో చేరి పాణ్యం నుంచి పోటీ చేశారు. ఆమె కూడా ఓడిపోయారు.



ఓడిపోయినా కూడా

2019లో టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమి చవి చూసిన గౌరు చరిత ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. రాష్ట్రంలో వైసీపీకి అత్యధిక ప్రాబల్యం ఉన్నా.. టీడీపీ నాయకులపై కేసులు నమోదవుతున్నా, వేధింపులకు గురి చేస్తున్నా కూడా ఆమె మాత్రం వెనక్కు తగ్గలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది టీడీపీ నాయకులు వైసీపీ అరాచకాలను ప్రశ్నించేందుకు ముందుకు రావడానికి భయపడిన తరుణంలో గౌరు చరిత మాత్రం ఏ మాత్రం వెనుకడుగు వేయలేదు. నియోజకవర్గంలోని కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఏ కష్టం వచ్చినా, ఏ ప్రమాదం వచ్చినా ముందుండి వారికి అండగా నిలిచారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి అరాచకాలను సైతం ఎదురొడ్డి పోరాడారు. ఆయన అరాచకాలను ప్రశ్నించడంలో ముందు నిలబడ్డారు. నిత్యం కార్యకర్తలకు ధైర్యం చెబుతూ అండగా ఉండటంతోనే ఈ రోజు ఆమెను విజయం వరించింది. టీడీపీ వస్తే తాను ఏం చేసేదీ పల్లె పల్లెలో హామీ ఇచ్చారు. దీంతో పాటు సౌమ్యురాలు, మృదు స్వభావి కావడంతో పాణ్యం నియోజకవర్గ ప్రజలను ఇట్టే ఆకర్షించారు. వైసీపీలో ఉన్న సమయంలో కూడా ఏనాడూ అరాచకాల జోలికి వెళ్లలేదు.

అర్బన్ వార్డుల్లో సైతం

కల్లూరు అర్బన్ వార్డుల్లో సైతం టీడీపీ మెజారిటీ సాధించింది. 16 వార్డుల్లో 23,017 ఓట్ల మెజారిటీ కైవసం చేసుకుంది. ప్రతి వార్డులో వేయికి పైగా మెజారిటీ దక్కింది. అత్యధికంగా 33వ వార్డులో వైసీపీకి కంటే 36.20 శాతం అత్యధిక మెజారిటీ సాధించింది.



ఖాళీ స్థలాల్లో కాటసాని కబ్జాలు, అరాచకాలే వార్డు ప్రజల్ని టీడీపీ వైపు మళ్లించాయి. దీంతోపాటు అర్బన్ వార్డులకు ప్రతి రోజూ తాగునీరు అందిస్తామని గౌరు చరిత హామీ ఇవ్వడంతో వార్డు ప్రజలు కూడా టీడీపీ వైపే మొగ్గు చూపారు.

టీడీపీ మెజారిటీ వివరాలు ఇలా..

● **పాణ్యం మండలం:** పర్ల-882, ఎ.గోకులపాడు- (-1), నెరవాడ -83, సల్కాపురం-344, కె.మార్కాపురం-32, పెద్దకొట్టాల-79, బస్తిపాడు-292, పుసులూరు-(-100), రేమడూరు-180, నాయకల్లు-78, కొంగనపాడు-(-18), చెట్ల మల్లాపురం-01, ఉలిందకొండ-1333, చిన్నటేకూరు-515, యాపర్లపాడు-133, తడకనపల్లె-425, పెద్దటేకూరు-240, బొల్లవరం-118, దూపాడు-162, దొడ్డిపాడు-30 (మొత్తం -4808 ఓట్ల మెజారిటీ వచ్చింది)

● **కల్లూరు అర్బన్ వార్డులో:** వార్డు-19లో 1370, వార్డు 19-20లో 1227, వార్డు-20లో 569 వార్డు-21లో 673, వార్డు 26లో 841, వార్డు 27లో 950, వార్డు 28లో 2126, వార్డు 29లో 1332, వార్డు 30లో 1089, వార్డు-31లో 1068, వార్డు-32లో 2112, వార్డు 33లో 2621, వార్డు-34లో 2381, వార్డు-35లో 1757, వార్డు-36లో 1436, వార్డు-37లో 487, వార్డు 41లో 978 మెజారిటీ వచ్చింది. మొత్తం 23,017 ఓట్లు మెజారిటీ వచ్చింది.

● **ఓర్వకల్లు మండలంలో:** నన్నూరు-323, బైరాపురం-55, లొద్దిపల్లె-240, ఉయ్యాలవాడ-807, మీదివేముల-(-326), పూడిచెర్ల-151, కేతవరం-53, కన్నమడకల-518, ఓర్వకల్లు-346, గుట్టపాడు-123, కొంతలపాడు-(114), ఉప్పలపాడు-118, పాలకొల్లు-65, చింతలపల్లి-(-33), కొమరోలు-60, సోమయాజులపల్లె-474, కాల్వ -(-71), గుడుంబాయితాండా-(-38), హుశేనాపురం-1168, తిప్పాయపల్లె-22, శకునాల-27 బ్రాహ్మణపల్లె-17లో మొత్తం మెజారిటీ 3641 వచ్చింది.

● **గడివేములలో:** మంచాలకట్ట-105, గని-574, ఎల్‌కే తండా-71, ఒండుట్ల-(58), కె.బొల్లవరం-111, గడిగరేవుల-294, చిందుకూరు-257, బూజనూరు-15, గడివేముల-1090, కొర్రపోలూరు-69, బిలకల్ గూడూరు-(-54), ఆళ్లగడ్డ-(-43), పెసరవాయి-444, కర్రిమిద్దెల-492, తిరుపాడు-40, కొరటమద్ది-95, దుర్వేసి-299 ఓట్లతో మొత్తం 3801 మెజారిటీ వచ్చింది.


● **పాణ్యంలో:** పిన్నాపురం-(-37), తమ్మరాజుపల్లె-282, పాణ్యం టౌన్-1662, సుగాలిమెట్ట-98, కొండవీడు-164, కందికాయపల్లె-31, అలమూరు-34, గోనవరం-175, భూపనపాడు-261, నెరవాడ-38, కౌలూరు-119, గోరుకల్లు-325, కొండజూటూరు-118, బలపనూరు-210, తొగర్చేడు-(-31), మద్దూరు-38, అనుపూర్-(-256), కొత్తూరు-129 ఓట్లతో మొత్తం 3360 మెజారిటీ వచ్చింది.

పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ మెజారిటీ

మండలం	మెజారిటీ
పాణ్యం	3,360
గడివేముల	3,801
ఓర్వకల్లు	3,641
కల్లూరు	4,808
అర్బన్ 16 వార్డులు	23,010

కబ్జాలే కొంపముంచాయి..

కాటసాని రాంభూపాల్‌రెడ్డి భూ సెటిల్‌మెంట్లు, అరాచకాలు, కబ్జాలు, ఇసుక, ఎర్రమట్టి మాఫియాతో ఓడిపోయినట్లు తెలుస్తోంది. పాణ్యంలో ప్రతి టెండరులో ఈయనే. కాంట్రాక్టర్లను ఎవరినీ ముందుకు రానివ్వలేదన్న అపవాదు మూట గట్టుకున్నారు. పిన్నాపురం, కందికాయపల్లె సోలార్ పనుల్లో కూడా వీరి వాటా ఉందని తెలుస్తోంది. గనిలోని సోలార్ క్లీనింగ్ పనులను వేరే వాళ్ల నుంచి బలవంతంగా లాక్కున్నట్టు సమాచారం. ఇలా చెప్పుకుంటూపోతే కాటసాని అరాచకాలు అన్నీఇన్నీ కావు. ఇలా ప్రజల్లో గూడుకట్టుకున్న వ్యతిరేకత చివరకు కాటసాని ఓటమికి కారణమైందని తెలుస్తోంది.



సంగమేశ్వరం వద్ద పెరుగుతున్న కృష్ణాజలాలు



కొత్తపల్లి, జూన్ 8: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీశైలం రిజర్వాయర్‌లో ఉన్న సప్తనదుల సంగమేశ్వర ఆలయం వద్ద స్వల్పంగా కృష్ణాజలాలు పెరుగుతున్నాయి. నైరుతి రుతుపవనాల రాకతో శనివారం ఎగువ ప్రాంతాల నుంచి కొద్దిగా వరద నీరు శ్రీశైలం రిజర్వాయరుకు వచ్చి చేరుతున్నది. ఈ మేరకు సంగమేశ్వర ఆలయంలో రెండు అడుగుల మేర వరద జలాలు పెరిగినట్లు ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం రిజర్వాయరులో నీటి మట్టం పెరుగుతుండటంతో మత్స్యకారులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంగమేశ్వరం వద్ద కృష్ణాజలాలు

అదుపుతప్పి ఎస్సార్బీసీలో పడిన ట్రాక్టర్



ఎస్సార్బీసీ కాలువలో పడి మృతి చెందిన మక్బుల్ బాషా

అక్కడికక్కడే మృతి చెందిన డ్రైవర్

మిడుతూరు, జూన్ 8: ఎస్సార్బీసీ కాలువలోకా ట్రాక్టర్ దూసుకెళ్లడంతో డ్రైవర్ మృతి చెందాడు. మండల పరిధిలోని అలగనూరు గ్రామానికి చెందిన మక్బుల్ బాషా(25) శనివారం ట్రాక్టర్‌తో పొలం పనులు చేసి తిరిగి ఇంటికి బయలుదేరాడు. ట్రాక్టర్ నడుపుతుండగా అదుపు తప్పి ఎస్సార్‌బీసీ కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో మక్బుల్‌బాషా ట్రాక్టర్‌తోపాటు కాలువలో పడిపోయాడు. ఆయన తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక కొడుకు చనిపోవడంతో తల్లి మాబున్ని, తండ్రి సోపిసాహెబ్ బోరున విలపించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు.



కాలువలో పడిన ట్రాక్టర్

పదవుల్లో ఉంచుతారా... దించుతారా..?

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 8: ఉమ్మడి జిల్లాలో ముఖ్యమైన శాఖలకు సంబంధించి పదవుల్లో ఉన్న వైసీపీ నాయకుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. ముఖ్యంగా మార్కెటింగ్ శాఖ పరిధిలో 15 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. కోడుమూరు, పాణ్యం మార్కెట్ కమిటీలకు చైర్మన్లు, డైరెక్టర్లుగా వైసీపీకి చెందిన నాయకులే కొనసాగుతున్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో ఆయా మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్లకు పదవీ గండం పొంచి వుంది. ఇప్పటికే ముఖ్యమైన మార్కెట్ కమిటీలకు సంబంధించి చైర్మన్, డైరెక్టర్ల పదవులను దక్కించుకునేందుకు తెలుగుదేశం పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ఎమ్మెల్యేలను ఆశ్రయించినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్లకు ఇంకా కొద్ది నెలలపాటు పదవుల్లో కొనసాగే అవకాశాన్ని గత వైసీపీ ప్రభుత్వం కల్పించింది. అయితే.. నామినేటెడ్ పదవుల్లో ఉన్న వీరిని తక్షణమే మార్చేందుకు టీడీపీ ప్రభుత్వం అవసరమైన చర్యలు ఇప్పటికే చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ పదవుల్లో ఉన్న వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీ ఉత్తర్వులు జారీ చేయకముందే తమ పదవులకు రాజీనామాలు చేసి స్వచ్ఛందంగా కొనసాగుతారో లేక తమకు ఇంకా అవకాశం ఉందని అలాగే పదవుల్లో కొనసాగుతారో తెలియడం లేదు. వారు పదవుల్లో కొనసాగాలని నిర్ణయించుకున్నా టీడీపీ ప్రభుత్వం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని కొనసాగించే అవకాశం లేదని ప్రస్తుత పరిస్థితులను బట్టి తేటతెల్లమైపోయింది. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, ఆత్మకూరు, బనగానపల్లె, నందికొట్కూరు, పత్తికొండ, ఆలూరు, డోన్ తదితర ముఖ్యమైన మార్కెట్ కమిటీల్లో చైర్మన్లుగా, డైరెక్టర్లుగా పదవులు సాధించుకునేందుకు టీడీపీ ముఖ్య నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.



జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయం

డీసీసీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న వైసీపీకి చెందిన ఎస్వీ విజయ మనోహరి శనివారం తన పదవికి రాజీనామా చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో కర్నూలు జిల్లాలో కీలకమైన నాయకుడిగా మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి కొనసాగారు. దీంతో అప్పటి సీఎం జగన్ ఈ పదవిని ఎస్వీ సతీమణి విజయ మనోహరికి ఇచ్చారు. రైతులకు ఏటా వందల కోట్ల రూపాయల రుణాలు ఇప్పించే అవకాశం ఆ పదవికి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఈ పదవిపై ఉమ్మడి జిల్లాలోని తెలుగుదేశం పార్టీకి చెందిన ముఖ్య నాయకులంతా ఆశలు పెట్టుకున్నారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో 96 వ్యవసాయ సహకార సంఘాలకు అప్పటి వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేల సిఫారసుతో ఆ పార్టీకి చెందిన నాయకులే చైర్మన్లుగా డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ మాదిరిగానే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో కొనసాగుతున్న చైర్మన్లు, డైరెక్టర్లు సంఘాల ప్రెసిడెంట్లు వారంతకు వారే పదవి నుంచి దిగిపోతారా లేక వారిని టీడీపీ ప్రభుత్వం వెంటనే దిగిపోయేలా ఉత్తర్వులు జారీ చేస్తుందా అన్న విషయంపై తీవ్ర ఉత్కంఠత నెలకొంది.

నేడు ఎమ్మెల్యే బుడ్డా విజయోత్సవ సభ

ఆత్మకూరు, జూన్ 8: శ్రీశైలం నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా బుడ్డా రాజశేఖరరెడ్డి విజయం సాధించడంతో ఆదివారం ఆ పార్టీ శ్రేణులు విజయోత్సవ సభ నిర్వహించనున్నారు. ముందుగా నంద్యాల టర్నింగ్ నుంచి మార్కెట్ యార్డు వరకు భారీగా ర్యాలీ జరపనున్నారు. ఆ తర్వాత మార్కెట్ యార్డు ప్రాంగణంలో విజయోత్సవ సభను నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి శ్రీశైలం నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన సుమారు ఐదు వేల మంది హాజరుకానున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ఎమ్మెల్యే బుడ్డాను కలిసిన ప్రముఖులు


ఎమ్మెల్యే బుడ్డాను కలిసిన ఏఎస్పీ చంద్రబాబు

ఆత్మకూరు, జూన్ 8: శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన బుడ్డా రాజశేఖరరెడ్డిని శనివారం పలువురు ప్రముఖులు మర్యాద పూర్వకంగా కలిశారు. విజయ వాడలో ఉన్న ఆయన్ని హోంగార్డు విభాగం ఏఎస్పీ చంద్రబాబు, గుంటూరు ఎల్‌వీఆర్ క్లబ్ కమిటీ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'పారిశుధ్యంపై దృష్టి సారించాలి'


పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నందికొట్కూరు, జూన్ 8: వర్షాకాలం ప్రారంభమైనందున పట్టణంలో పారిశుధ్యంపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి మున్సిపల్ పారిశుధ్య మేస్త్రీలు, శానిటరీ సెక్రటరీలను ఆదేశించారు. శనివారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో వాటర్ లైన్స్ అండ్ శానిటరీ మేస్త్రీలు, సచివాలయం శానిటేషన్ సెక్రటరీలు, సచివాలయం సిబ్బందితో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా పట్టణంలోని లోతట్టు ప్రాంతాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిల్వ ఉన్న నీటిని త్వరితగతిన మెయిన్ డ్రైనేజీలలో ఎటువంటి నిలువ లేకుండా తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం వల్లతాగేనీరు కలుషితం కాకుండా స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వర్షం కారణంగా నీటి నిల్వను గుర్తించి తక్షణమే డ్రైనేజీలోకి నీటి నిల్వను పంపామని చెప్పారు.

మొక్కజొన్న సాగులో అన్నదాతలు


మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న కూలీలు

మిడుతూరు, జూన్ 8: మిడుతూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పొలం పనులలో నిమగ్నమయ్యారు. గత వారం రోజులగా కురిసిన వర్షానికి రైతులు తమ పొలాలను దక్కులు దున్ని మొక్క జొన్న విత్తనాలు విత్తుకునేందుకు రైతన్నలు బిజీగా ఉన్నారు. రైతుల సౌకర్యార్థం ఇండియన్ సైన్స్ అగ్రికల్చర్ కేవీకే వారి ఆధ్వర్యంలో వరి, కందులు, మినుములు, జీలుగ విత్తనాలను వ్యవసాయ అధికారులు మంజూరు చేశారు. గ్రామాలలోని రైతులు అధికశాతం మొక్కజొన్న పంటసాగుకు ఆసక్తి చూపుతున్నప్పటికీ కార్యాలయానికి మొక్కజొన్న విత్తనాలు మంజూరు చేయకపోవడంతో నందికొట్కూరు పట్టణంలోని ప్రైవేట్ విత్తన దుకాణాలను ఆశ్రయించి అధిక ధరలకు విత్తనాలను కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన విత్తనాలను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

వర్షంతో రైతన్నల హర్షం


కరివేన నీటి కుంటలో నిలిచిన వర్షపు నీరు

ఆత్మకూరు, జూన్ 8: నైరుతి రుతుపవనాల రాకతో ఆత్మకూరు ప్రాంతంలో కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మే నెలలోనే పంటపొలాల్లో వేసవిదుక్కులు దున్నుకోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంటపొలాలు పదునెక్కి విత్తనాలను విత్తేందుకు అనుకూలంగా మారాయి. దీంతో వారంరోజులుగా ఇక్కడి రైతులు విత్తనాల కొనుగోలులో బిజీబిజీగా ఉంటున్నారు. కాగా మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటపొలాల్లో తేమశాతం అధికంగా వుంది. తేమశాతం తగ్గుముఖం పట్టగానే విత్తనాలను నాటేందుకు రైతులు సిద్ధంగా ఉన్నాయి. అదేవిధంగా నీటిగుంటల్లో కూడా వర్షపునీరు నిలిచిపోవడంతో భూగర్భజలాలు సైతం పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా ఖరీఫ్ ఆరంభంలోనే తొలకరి వర్షాలు సమృద్ధిగా కురియడంతో రైతన్నలు హర్షం వెలిబుచ్చుతున్నారు.

పాఠ్య పుస్తకాలు మంజూరు

కొత్తపల్లి, జూన్ 8: మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు మంజూరైనట్లు కొత్తపల్లి ఎంఈవో-2 ఇనయతుల్లా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 1 నుంచి 2వ తరగతి వరకు సుమారు 3వేల పాఠ్యపుస్తకాలు మంజూరు కాగా, 3 నుంచి 7 తరగతులకు మొదటి విడతగా 900 పాఠ్యపుస్తకాలు మంజూరైనట్లు తెలిపారు. అలాగే 8వ తరగతికి 2,817 పాఠ్య పుస్తకాలు మంజూరు కాగా, 9వ తరగతికి 4,082, పదో తరగతికి 3,575 పుస్తకాలు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే 16,746 నోటు పుస్తకాలు కూడా మంజూరు కాగా, బెల్టులు 2,300 ఎంఆర్‌సీ భవనానికి చేరినట్లు తెలిపారు. ఇంకా మిగతా పాఠ్యపుస్తకాలు కూడా పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు వస్తాయని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే అన్ని తరగతులకు పుస్తకాలు పంపిణీ చేస్తామని ఎంఈవో తెలిపారు.

ఆలయాల్లో టీడీపీ నాయకుల పూజలు


నంద్యాలలో రాజ్యాధికార పాశుపత రుద్రాభిషేకం


పాములపాడు: ఎర్రగూడూరులో సంజీవ ఆంజనేయస్వామి ఆలయం వద్ద టెంకాయలు కొట్టిన టీడీపీ నాయకులు

నంద్యాల కల్చరల్, జూన్ 8: నంద్యాల ఆర్టీసీ బస్టాండు సమీపంలో వెలసిన నీలకంఠేశ్వర మధువర్ణబాణలింగ మందిరంలో శనివారం భక్తిశ్రద్ధలతో రాజ్యాధికార పాశుపత రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. త్వరలో ఏర్పాటు కాబోయే మంత్రి వర్గంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, నంద్యాల ఎమ్మెల్యే ఎన్ఎండీ ఫరూక్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మంత్రి పదవులు పొందాలని వీరి పేరుమీద ఏపీ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో యాడవల్లి కార్తికేయశర్మ, మాడుగుల నాగేంద్ర శర్మ వేదమంత్రాల నడుమ రాజ్యాధికార పాశుపత రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రావినూతల దుర్గా ప్రసాద్, భరద్వాజశర్మనగరడోణ సుధీర్, బ్రాహ్మణసేవా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: ఎన్నికల పలితాల్లో రాష్ట్రంలో టీడీపీ కూటమి అత్యధిక సీట్లు గెలుపొంది అధికారంలోకి వస్తున్నందున టీడీపీ నాయకులు తమ ఇష్టదైవాలకు మొక్కుకున్న మొక్కులు చెల్లిస్తున్నారు. శనివారం మండలంలోని బుడ్డనగర్ గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయంలో రాష్ట్రంలో కూటమి 164 సీట్లు సాధించడంతో మాజీ సర్పంచ్ హరిప్రసాద్, జనసేన నాయకులు రాము, టీడీపీ నాయకులు భావన వినోద్, సంజన్న నాగేశ్వరరావు, యన్నం బ్రహ్మయ్యలు 164 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకొని గ్రామ ప్రజలకు విందు ఏర్పాటు చేశారు. అలాగే ఎర్రగూడూరు గ్రామ శివార్లలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద పాములపాడు, కంబాలపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మధుకృష్ణ, పాపిరెడ్డి, శివ, నబీరసూల్, లింగస్వామి, నడిపి, పెద్దమాబులు 101 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దేవుడ్ని కోరుకున్నట్లు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన నందికొట్కూరు ఎమ్మెల్యే


కలెక్టర్ శ్రీనివాసులుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



ఎస్పీ రఘువీర్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, జూన్ 8: నంద్యాల కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డిని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం నంద్యాలలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీనివాసులును ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి జిల్లా ఉన్నతాధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. మాజీ ఎంపీపీ వీరం ప్రసాద్‌రెడ్డి, పగిడ్యాల మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్‌రెడ్డి, బ్రాహ్మనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

జూపాడుబంగ్లా, జూన్ 8: మండలంలో శనివారం ఉదయం నుంచి విద్యుత్తు కోతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండో శనివారం మరమ్మతులు పేరిటా ఉదయం నుంచి సాయంత్రం 3గంటల వరకు కోత విధించారు. ఒక గంటపాటు సక్రమంగా ఉందో లేదో రాత్రి 7.30 గంటలకు విద్యుత్ కోత విధించారు. విద్యుత్‌శాఖ అధికారుల అందుబాటులో లేకపోవడం, కనీసం వినియోగదారులు కోతకు గల కారణాలు తెలుకునేందుకు ఫోను లిఫ్టు చేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తుశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి ఫోనుతీసి సమాచారం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సూక్ష్మ పుష్పాలతో రామోజీరావుకు నివాళి



నంద్యాల కల్చరల్, జూన్ 8: నంద్యాలకు చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మరణం తీరనిలోటు అని, ఆయనను స్మరించుకుంటూ ఆయన చిత్రాన్ని వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఎ3 డ్రాయింగ్ షీట్ పై రకరకాల రంగుల సూక్ష్మ పూలలతో 3గంటల పాటు శ్రమించి రామోజీరావు చిత్రాన్ని వేసి చిత్రనివాళులు అర్పించారు చిత్రకారుడు కోటేష్. ఈనాడు గ్రూపు సంస్థల ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పించిన మహనీయుడు, ఈనాడు పత్రిక, ఈటీవీ, రామోజీ ఫిలింసిటీ ద్వారా ఎంతో మంది కళాకారులకు గుర్తింపు, ఉపాధి కల్పించిన తెలుగురత్న రామోజీరావు అని కొనియాడారు. ఈ అక్షర యోధునికి రంగురంగుల పూలతో పుష్పాభిషేకం, పుష్పాంజలి చిత్రించి చిత్రనివాళులు అర్పించారు.

ఇన్‌చార్జి ఎస్పార్బీసీ ఎస్ఈగా వరప్రసాద్

నంద్యాల రూరల్, జూన్ 8: ఎస్పార్బీసీ సూపరిండెంట్ ఇంజనీర్‌గా వరప్రసాద్ సోమవారం అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. డివిజన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చెంగయ్య కుమార్ నంద్యాల సర్కిల్-2లో అదనపు ఎస్ఈ పనిచేస్తూ మే నెలాఖరున పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో పాణ్యం డివిజన్-2 ఈఈ వరప్రసాద్ నంద్యాల ఎస్ఈగా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

మిద్దె కూలి మహిళ మృతి

పాణ్యం, జూన్ 8: పాణ్యంలోని బోయపేటలోని మిద్దె కూలి శుక్రవారం రాత్రి రామినేని లక్ష్మీదేవి (59) మృతి చెందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడవడంతో మట్టి మిద్దె కూలినట్లు తెలిపారు. ఇంట్లో కూర్చొని ఉండగా హఠాత్తుగా మిద్దె కూలినట్లు బంధువులు తెలిపారు. వీఆర్వో బీరేంద్ర, వీఆర్ఏలు మధుశేఖర్, విజయ్, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కూలిన ఇంటి గోడ


వర్షానికి కూలిన ఇంటి గోడ

పాములపాడు, జూన్ 8: పాములపాడులో కేసీ కెనాల్ సమీపంలోని రాజశేఖర్‌నకు చెందిన మట్టి మిద్దె వర్షాల కారణంగా ఒకవైపు ఇంటిగోడ పడిపోయింది. దీంతో పట్టాలు కప్పి మిగతా పైకప్పు, గోడ కూలిపోకుండా జాగ్రత్తలు చేపట్టారు. గత నాలుగు రోజలుగా కురు స్తున్న వర్షాల కారణంగా ఇంటిగోడ కూలిపోయి దాదాపు రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రామోజీరావుకు ఘన నివాళి


నంద్యాలలో నివాళి అర్పిస్తున్న ప్రముఖులు


మహానందిలో నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు


నందికొట్కూరులో నివాళి అర్పిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని సోదరులు


ఆత్మకూరు: నివాళి అర్పిస్తున్న నాయకులు



వెలుగోడులో..

నంద్యాల కల్చరల్, జూన్ 8: రామోజీ సంస్థల అధినేత రామోజీరావుకు నంద్యాలలోని పలు సాహితీ సంస్థల ప్రతినిధులు సంతాపం తెలిపారు. నంద్యాల ఎన్జీవోస్ హోమ్‌లో శనివారం సాహితీ సంస్థల ప్రతినిధులు నివాళి అర్పించారు. సాహితీస్రవంతి అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, సూరన సారస్వత సంఘం అధ్యక్షుడు డాక్టర్ గెలివి సహదేవుడు, అన్నెం శ్రీనివాసరెడ్డి, నంద్యాల రచయతలు నరేంద్ర, ప్రసాద్, శేషఫణి, మహబుబ్ బాషా, తదితరులు పాల్గొని కవితల రూపంలో నివాళి అర్పించారు. నంద్యాల కళారాధన సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డా.మధుసూదనరావు, డా.రవికృష్ణ ఆధ్వర్యంలో రామోజీ రావుకు సంతాపం తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోషియేషన్, కళారాధన సాంస్కృతిక సంస్థ, దివ్యాంగుల సంక్షేమ సంఘం, లయన్స్‌క్లబ్, వివిధ క్రీడా సంఘాల సభ్యుల సంతాపం తెలిపారు.

ఆత్మకూరు: ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటం వద్ద నాయకులు నివాళి అర్పించారు. టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, నాయకులు రాజారెడ్డి, రవీంద్రబాబు, సుబ్బరాజు, కలీముల్లా, శ్రీనివాసులు, శివశంకరశర్మ తదితరులు ఉన్నారు.

మహానంది: రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతికి మహానందిలో మండల టీడీపీ నాయకులు, జర్నలిస్టులు సంతాప తెలిపారు. టీడీపీ నాయకులు గడ్డం నాగపుల్లయ్య, కంచెర్ల శివ పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడులోని టీడీపీ కార్యాలయంలో రామోజీరావుకు సంతాపం తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

పాణ్యం: రామోజీరావు మృతి పట్ల పలువులు సంతాపం తెలిపారు. భూపనపాడులో సీపీఎం కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నగేంద్ర, సుబ్బయ్య, శేషిరెడ్డి, నారాయణ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జర్నలిస్టులు సంతాపం తెలిపారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణమూర్తి, ఎంపీటీసీ రంగరమేష్, మాజీ జడ్పీటీసీ నారాయణమ్మ, ఖాదర్‌బాషా, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్‌నాయుడు, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

నందికొట్కూరు: నందికొట్కూరులో టీడీపీ నాయకులు రామోజీరావు మృతికి సంతాపం తెలిపారు. శనివారం రబ్బాని కాంప్లెక్స్‌లో నందికొట్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, ఆయన సోదరుడు జాకీర్ నివాళి అర్పించారు. రాజు, కళాకర్ తదితరులు పాల్గొన్నారు. నందికొట్కూరు టీడీపీ కార్యాలయంలో పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జి ముర్తుజావలి ఆధ్వర్యంలో రామోజీరావుకు నివాళి అర్పించారు. నాయకులు వేణుగోపాల్, మద్దిలేటి, నిమ్మకాయల మోహన్, గిరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన కొర్రపోలూరు సర్పంచ్


గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన సర్పంచ్

గడివేముల, జూన్ 8: మండలంలోని కొర్రపోలూరు గ్రామ సర్పంచ్ మాలిక్‌బాషా, గ్రామానికి చెందిన 150 కుటుంబాలు శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకట్‌రెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి గౌరు దంపతులు పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. అనంతరం కొర్రపోలూరు సర్పంచ్ మాలిక్‌బాషా మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత తమ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తారని హామీ ఇచ్చారని అన్నారు. గౌరు కుటుంబంపై నమ్మకంతోనే తాము వైసీపీని వీడి టీడీపీలో చేరామన్నారు. గ్రామానికి చెందిన భూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. భూ సమస్యలు పరిష్కరించడానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి పూజలు


వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నంద్యాల కల్చరల్, జూన్ 8: నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయంలోని వేంకటేశ్వర స్వామికి శనివారం ఉదయం సామూహిక విష్ణుసహస్రనామం, లక్ష్మీ అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. సాయంకాలం అర్చకుడు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం వినాయక, దన్వంతరి, సుదర్శన హోమం నిర్వహించారు. రాత్రి 8.30 గంటలకు రజిత సప్త హారతులతో రాజోపచారులతో స్వామికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భగవత్ సేవాసమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, కమిటీ సభ్యులు దేవరశెట్టి శ్రీనివాస్, పార్థసారథికృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా హోమం


దుర్గాభోగేశ్వరంలో హోమం చేస్తున్న ఆలయ అర్చకులు

గడివేముల, జూన్ 8: మండలంలోని గడిగరేవుల గ్రామ పరిధిలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా స్వామి వారికి రుద్రహోమం, రుద్రాభిషేకం, మహన్యాస పూర్వక అభిషేకాలను నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ తెలిపారు. అనంతరం స్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామ్‌సుందర్‌శర్మ పంచామృతాభిషేకాలు నిర్వహిం చారు. అభిషేకం, హోమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ముగిసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు


వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా, జూన్ 8: మండలంలోని 80బన్నూరు గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా పలు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గోమాతకు పూజలు నిర్వహించి, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అహింసకు మించిన ధర్మం మరొకటిలేదని, సకల శాస్త్రాలు భూతదయ కలిగి ఉండాలని చెబుతున్నాయని, సమాజంలో అశాంతిని దూరం చేయాలంటే సకల జీవులలోని పరమాత్మను గుర్తించాలని తిరుమల తిరుపతి దేవస్థానం హిందుధర్మప్రచార పరిషత్ జిల్లాశాఖ కార్యనిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి అన్నారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, మనోహర్, చరణ్‌సాయి, రవికుమార్, పుల్లయ్య, దర్గయ్య, నీలకంఠమాచారి తదితరులు పాల్గొన్నారు.


ఖాళీ బిందెలతో నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పాణ్యం, జూన్ 8: తాగునీరందించి దాహార్తి తీర్చాలని స్థానిక ఎస్సీ కాలనీ మహిళలు శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. సెలవు దినం కావడంతో అరగంట సేపు తమ నిరసన తెలిపి పంచాయతీ సిబ్బందికి తమ సమస్యను తెలిపారు. మహిళలు మాట్లాడుతూ రెండు నెలలుగా తాగునీరు సక్రమంగా అందడం లేదన్నారు. గ్రామ పంచాయతీ అందిస్తున్న ట్యాంకర్ల నీరుసరిపోవడం లేదన్నారు. బోయపేట, ఎస్సీ కాలనీలకు ప్రతి రోజూ రెండు సార్లు నీటి సరఫరా చేస్తున్నా సరనిపోవడం లేదన్నారు. బోర్లు ఇంకిపోవడంతో ఈ సమస్య వచ్చిందని అధికారులు చెబుతున్నారు. కొత్త బోర్లు వేయడానికి ఎన్నికల కోడు అడ్డం వచ్చిందని అధికారులు పేర్కొంటున్నారన్నారు. తమకు నీరందించని పక్షంలో జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తామని మహిళలు హెచ్చరించారు. నీరు సరిపోకపోవడంతో బృంగేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి తెచ్చుకుంటున్నామన్నారు. రెండునెలలుగా తాగునీటి సమస్యను సర్పంచ్‌కు తెలిపామన్నారు. తాగునీరందించడంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు. కొత్త బోర్లు వేసి నీటి సమస్యను తార్చాలని టీడీపీ జిల్లా కార్యదర్శి రమణమూర్తి డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులు, ఎస్సీ కాలనీ మహిళలు పాల్గొన్నారు. ఎంపీడీవో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దొంగు వద్ద ఉన్న బోరు ఎండిపోవడంతో ఈపరిస్థితి చోటుచేసుకుందన్నారు. ఇప్పటికే రెండు పూటలా రెండు కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీరందిస్తున్నామని, నీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ట్యాంకర్లను పెంచి తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామన్నారు.

సహకార సొసైటీ చైర్మన్ పదవికి రాజీనామా

మిడుతూరు, జూన్ 8: మండలంలోని పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ చైర్మన్ తమిదెల నాగతులసి రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. సొసైటీ చైర్మన్ నాగతులసి రెడ్డి నాగలూటి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు. 2019 ఆగస్టు నెలలో చైర్మన్ పదవికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే శనివారం తన పదవికి రాజీనామా చేశారు.



మంత్రులెవరో..?

- కర్నూలు ఐదు స్థానాల్లో టీడీపీ కూటమి విజయం
- ఇందులో నలుగురు యువ అభ్యర్థులు
- బీవీ ఒక్కడే రెండోసారి ఎన్నిక
- మంత్రి పదవి రేస్‌లో పలువురు నేతలు
- ఉమ్మడి జిల్లాను పరిగణలోకి తీసుకుంటే అవకాశాలు తక్కువే
- మిత్రపక్షం కోటాలో బీజేపీ పార్థసారథికి చాన్స్ ఉండేనా..?

కర్నూలు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):


కర్నూలులో టీడీపీ సునామి సృష్టించింది. కర్నూలు, నంద్యాల పార్లమెంట్ స్థానాలతోపాటు 12 అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఎన్టీఆర్ పార్టీని స్థాపించిన తర్వాత ఉమ్మడి జిల్లాలో ఇద్దరు ఎంపీలు, 12 మంది ఎమ్మెల్యేలు గెలవడం టీడీపీకి ఓ చరిత్ర. రాష్ట్రంలోనూ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయ దుందుభి మోగించింది. ఈ నెల 12న బుధవారం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. వేదిక, ముహూర్తం ఖరారు చేశారు. కర్నూలు పార్లమెంట్ నుంచి చంద్రబాబు కొలువులో మంత్రి కాబోతున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన మంత్రులను ఎంపిక చేస్తే కర్నూలు జిల్లా ఎమ్మెల్యేకు అవకాశాలు తక్కువే. ఎందుకంటే నంద్యాల జిల్లాలో టీడీపీ క్లీన్‌స్వీప్ చేసింది. పైగా సీనియర్లు అందరూ అక్కడే ఉన్నారు. కర్నూలు జిల్లాలో బీవీ జయనాగేశ్వరరెడ్డి ఒక్కరే రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. టీజీ భరత్, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలిచారు. మిత్రపక్షం బీజేపీకి చాన్స్ ఇస్తే ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి మంత్రి పదవి వచ్చే అవకాశం ఉంది.

ఐదుగురు ఎమ్మెల్యేల్లో బీవీనే సీనియర్



కర్నూలు పార్లమెంట్ పరిధిలో విజయం సాధించిన టీడీపీ కూటమి ఐదుగురు ఎమ్మెల్యేలలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి రెండు పర్యాయాలు గెలిచిన ఉన్నవారిలో సీనియర్. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, ప్రస్తుత టీడీపీ అధినేత చంద్రబాబు కుటుంబాలకు అత్యంత సన్నిహితుడైన దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి రాజకీయ వారసుడిగా 2014 ఎన్నికల్లో ఎమ్మిగనూరు నుంచి ఆయన తొలిసారిగా పోటీ చేసి విజయం సాధించారు. అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో మూడో పర్యాయం పోటీ చేసి విజయం సాధించారు. ప్రతి పార్లమెంట్ స్థానంలో ఒకరికి మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలని అధినేత చంద్రబాబు భావిస్తే బీవీ మోహన్‌రెడ్డి కుమారుడిగా, ఐదుగురు ఎమ్మెల్యేలో సీనియర్‌గా బీవీ జయనాగేశ్వరరెడ్డికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే నియోజకవర్గం నుంచి వరుసగా ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన దివంగత మాజీ మంతి బీవీ మోహన్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్, చంద్రబాబు కాబినెట్‌లో ఆరుసార్లు కాబినెట్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. బీవీ జయనాగేశ్వరరెడ్డి సైతం తండ్రిబాటలో మంత్రి పదవి చేపట్టడం ఖాయం అంటూ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

మిత్రపక్షం బీజేపీకి చాన్స్ ఇస్తే..



మిత్రపక్షం బీజేపీకి కనీసం రెండు మంత్రి పదువులు వచ్చే అవకాశం ఉంది. ఆ పార్టీలో ఎమ్మెల్యే సుజనా చౌదరి, అనంతపురం జిల్లా ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. బీజేపీలో బీసీ కోటాలో సత్యకుమార్, పార్థసారథి ఇద్దరిలో ఒకరికి చాన్స్ ఉంటుందని అంటున్నారు. వాల్మీకి కోటాలో ఎమ్మెల్యే సీటు దక్కించుకున్న పార్థసారథి అదే కార్డుతో చంద్రబాబు మంత్రివర్గంలో బెర్త్ ఖారారు చేసుకోవడానికి జాతీయ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే విజయవాడకు వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబును కలిసిన పార్థసారథి ఢిల్లీకి వెళ్లి బీజేపీ పెద్దలను కలుస్తున్నారు. శనివారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. మిత్రపక్షం కోటాలో బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథికి చాన్స్ ఉంటుందా..? అందరి నోటా ఇదే చర్చ.



బీసీ కోటాపై కేఈ శ్యాంబాబు ఆశలు



నంద్యాల జిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలే గెలిచారు. మంత్రి పదవులు ఆశిస్తున్న సీనియర్లు ఆ సామాజిక వర్గానికి చెందినవారే ఉన్నారు. రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో ఓసీలకే అవకాశం ఇస్తారా..? బీసీ కోటాలో కేఈ శ్యాంబాబుకు అవకాశాలు లేకపోలేదని, ఆయన తండ్రి మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్నారు.. కొడుకును మంత్రిగా చూడాలనే సంకల్పంతో కేఈ కృష్ణమూర్తి అధినేత చంద్రబాబుతో చక్రం తిప్పగలడని, ఆ కుటుంబం నుంచి కేఈ కృష్ణమూర్తి ఎన్టీఆర్, చంద్రబాబు కాబినెట్‌లో, కేఈ ప్రభాకర్ బాబు కాబినెట్‌లో ఇద్దరు కూడా మంత్రులుగా పని చేసిన అనుభవం ఉంది. ఆ కోటలో శ్యాంబాబకు అవకాశాలు ఉన్నాయంటూ పత్తికొండలో ప్రధానంగా చర్చించుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన మంత్రి పదవులు ఇస్తే..

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా మంత్రి పదవులు కేటాయిస్తే.. కర్నూలు జిల్లాకు చంద్రబాబు క్యాబినెట్‌లో అవకాశాలు తక్కువ అని పార్టీలో చర్చ జరుగుతోంది. నంద్యాల జిల్లా నుంచి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే ఎన్ఎండీ ఫరూక్, బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మంత్రి పదవులు ఆశిస్తున్నారు. కోట్ల కేంద్ర మంత్రిగా, ఫరూక్, అఖిలప్రియలకు రాష్ట్ర మంత్రులుగా పని చేసిన అనుభవం ఉంది. పార్టీ కష్టకాలంలో బీసీ అండగా ఉన్నారు. యువనేత నారా లోకేశ్ జిల్లాలో చేపట్టిన పాదయాత్రను అన్నీతానై ముందున్నారు. సీనియర్లగా ఈ నలుగురిలో ఇద్దరికి అవకాశం ఇస్తే.. కర్నూలు పార్లమెంట్‌కు చాన్స్ ఉండకపోవచ్చనే చర్చ చూడా ఉంది. అదే క్రమంలో అటు నంద్యాల, ఇటు కర్నూలు జిల్లాల పరిధిలో ఉంటున్న పాణ్యం నియోజకవర్గం నుంచి విజయం సాధించిన గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతులు వైసీపీలో కీలక అవకాశాలు వదులుకొని 2019లో టీడీపీలోకి వచ్చారు. చంద్రబాబు వారిని తప్పక గుర్తించి మంత్రివర్గంలో బెర్త్ ఖరారు చేస్తారని గౌరు వర్గీయులు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి అమాత్యులు ఎవరనే ఉత్కంఠకు 12వ తేదీ తెరపడనుంది.

ఆర్యవైశ్య కోటాలో టీజీ భరత్



సామాజిక సమీకరణల కోటాలో అవకాశాలు ఉండవచ్చని కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్, పత్తికొండ కేఈ శ్యాంబాబు అనుచరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా వీరిద్దరు కూడా తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచినవారే. రాష్ట్రంలో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన టీజీ భరత్, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఇద్దరే గెలిచారు. కర్నూలు నుంచి 1999లో టీడీపీ టికెట్‌పై, 2009లో కాంగ్రెస్ టికెట్‌పై రెండు పర్యాయాలు టీజీ వెంకటేశ్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. టీజీ వెంకటేశ్ రాజకీయ వారసుడిగా 2019 ఎన్నికల్లో టీడీపీ పోటీ చేసిన టీజీ భరత్ స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఓటమి నుంచి విజయం వైపు అడుగుల వేయాలనే లక్ష్యంగా ఆ రోజు నుంచే వ్యూహాత్మకంగా పని చేశారు. తాజా ఎన్నికల్లో టీజీ భరత్ 18.876 ఓట్ల భారీ ఆధిక్యతతో విజయం సాధించారు. ఈయనకు యువనేత నారా లోకేశ్, అధినేత చంద్రబాబుతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గెలిచిన వెంటనే యువనేత నారా లోకేశ్‌ను భరత్ కలిశారు. ఆర్యవైశ్య కోటాలో చంద్రబాబు కొలువులో బెర్త్ ఖాయని ఆయన వర్గీయులు అంటున్నారు.



రామోజీరావుకి కలెక్టర్ దంపతుల సంతాపం

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 8: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, మీడియా మొఘల్, పద్మ విభూషణ్ గ్రహీత అయిన రామోజీరావు మృతి పట్ల కలెక్టర్ దంపతులు డా.జి. సృజన, రవితేజ సంతాపం తెలియజేశారు. రామోజీరావు తెలుగు భాష కోసం, తెలుగు జాతి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు.



రామోజీరావుతో కలెక్టర్ దంపతులు (ఫైల్)

చెప్పులు లేకుండా ఐదేళ్లు కాలినడక

కోసిగి, జూన్ 8: టీడీపీ అధికారంలోకి వచ్చే వరకు చెప్పులు వేసుకోనని ఓ కార్యకర్త శపథం బూనాడు. వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన అయన ఈ మేరకు ఐదేళ్లు చెప్పులు లేకుండా నడిచాడు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే మండల పరిధిలోని దొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గడ్డం గోపాల్‌పై వైసీపీ నాయకులు దాడి చేశారు. వైసీపీ నాయకుల దాడిలో తీవ్ర గాయాలపాలై గోపాల్ టీడీపీ అధికారంలోకి వచ్చే వరకు కాళ్లకు చెప్పులు వేసుకోనని శపథం బూనాడు. ఈ మేరకు కాళ్లకు చెప్పులు లేకుండానే తిరుగుతున్నాడు. టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాతనే కాళ్లకు చెప్పులు వేసుకుంటానని చెబుతున్నాడు.



కాళ్లకు చెప్పులు లేకుండా నడిచి వస్తున్న టీడీపీ కార్యకర్త గడ్డం గోపాల్

టిప్పర్ ఢీకొని జీవిత ఖైదీ మృతి

అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు సమీపంలో ప్రమాదం

బుక్కరాయసముద్రం, జూన్ 8: అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు వద్ద శనివారం టిప్పర్ ఢీకొని జీవిత ఖైదీ ఉప్పర ఈరన్న (50) మృతి చెందారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన ఈరన్న 2005లో తన భార్యను హత్య చేసిన కేసులో నిందితుడు. కోర్టులో నేరం రుజువు కావడంతో 2007లో జీవిత ఖైదు శిక్ష పడింది. కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తూ.. సత్ప్రవర్తనతో 2016లో అనంతపురం ఓపెన్‌ఎయిర్ జైలుకు వచ్చాడు. జైలుకు సంబంధించి వ్యవసాయ క్షేత్రంలో పనులు చేసేందుకు సైకిల్ మీద వెళుతుండగా వేగంగా వచ్చిన ఓ టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో ఈరన్న అక్కడిక్కడే మృతి చెందాడు. ఈరన్న 17 సంవత్సరాల నుంచి జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. కొత్త ప్రభుత్వంలో క్షమాభిక్షపై విడుదల అవుతానని తోటి ఖైదీలతో తరచూ అనేవాడు. ఇంతలోనే రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. ఈరన్న మృతితో ఓపెన్ ఎయిర్ జైలులో విషాదం నెలకొంది. ప్రమాదానికి కారణమైన ట్రిప్పర్ అనంతపురం నగరానికి చెందిన ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీది అని జైలు అధికారులు తెలిపారు. బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఓపెన్ ఎయిర్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ షఫిఫుర్ రెహమాన్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాభివృద్ధిలో భాగం కావాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 8: గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు భాగస్వాములు కావాలని పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కే. సుబ్రమణ్యం సూచించారు. శనివారం జిల్లా పరిషత్ ఆవరణలోని విశ్వేశ్వరయ్య సమావేశభవనంలో గ్రామ సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్యసమావేశం జిల్లా అధ్యక్షుడు ఎం. మనోజ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే.రవీంద్ర, జిల్లా అధ్యక్షుడు జీఎస్.గౌస్‌బాషా, ఎస్‌ఈ పీఏ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు క్రమశిక్షణతో పని చేయడంతో పాటు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ సభ్యులు మోహన్‌రాజ్, సమీనా, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

కోట్ల హర్షా.. ఇక నీ రౌడీయిజం మానుకో..

- కార్యకర్తలపై దాడులు చేస్తే వదిలి పెట్టం
- మీ అరాచకాలతో విసిగి పోయి మాకు పట్టం కట్టారు
- ఎన్నికల్లో ఓటమి జీర్ణించుకోలేకే గ్రామాల్లో చిచ్చు
- కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, నియోజకవర్గం ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు(అర్బన్), జూన్ 8: వైసీపీకి ఓట్లు వేయలేదని .. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి దాడులకు తెగబడుతున్నారని, ఇకనైనా ఆయన తన రౌడీయిజాన్ని మానుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, నియోజకవర్గం ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో వారు కోడుమూరు మండలం కొత్తపల్లెలో దాడికి గురైన టీడీపీ కార్యకర్తలతో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూకబ్జాలు, రౌడియిజం చేస్తూ పచ్చని గ్రామాల్లో అరాచకాలు చేస్తే ..ఇక వదలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. ఎరుకలి సామాజిక వర్గానికి చెందిన వారి పేరుతో దాడులకు తెగబడేలా చేస్తే ఎవరూ భయపడే ప్రసక్తి లేదని అన్నారు. ఎరుకలి సామాజిక వర్గం వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. శుక్రవారం రాత్రి కొత్తపల్లి గ్రామానికి చెందిన రాధాక్రిష్ణతో పాటు మరో ఆరుగురిపై దాడులకు పాల్పడిన 17 మంది వైసీపీ కార్యకర్తలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారే దాడులు చేసి ముందస్తుగా టీడీపీ కార్యకర్తలపై రివర్స్ కేసులు పెట్టేందుకు ముందస్తుగా ఆస్పత్రిలో చేరి హడావిడి చేశారని, దీనికి ఎవ్వరూ భయపడే ప్రసక్తి లేదన్నారు. ప్రతి టీడీపీ కార్యకర్తకు అండగా ఉంటామని అన్నారు. వైసీపీ అరాచకాలకు ప్రజలు విసిగిపోయి తమకు పట్టం కట్టారనే సంగతి ఆ పార్టీ నాయకులు గ్రహించాలని అన్నారు. అనంతరం కోడుమూరు, కొత్తపల్లి గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, బాధితులతో ఎస్పీ కార్యాలయాలనికి వెళ్లారు.



మాట్లాడుతున్న నియోజకవర్గం ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి

అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల, జూన్ 8 : పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన మౌనిక తనను అదనపు కట్నం కోసం భర్త, అత్త,మామలు వేధిస్తున్నారని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మాసూమ్ శనివారం తెలిపారు. ఎనిమిదేళ్ల క్రితం తుగ్గలి మండలం శభాష్‌పురం గ్రామానికి చెందిన రవీంద్రనాథ్‌తో సంజీవనగర్‌కు చెందిన మౌనికకు వివాహమైందన్నారు. అదనపు కట్నకానుకల కోసం భర్త రవీంద్రనాథ్, అత్త రామేశ్వరమ్మ, మామ రాజులు వేధింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముగిసిన ఓపెన్ స్కూల్ పరీక్షలు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 8: జూన్ 1వ తేదీన ప్రారంభమైన ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారంతో ముగిశాయి. పదో తరగతి పరీక్షకు మొత్తం విద్యార్థులు 261 మంది రిజిస్టర్ చేసుకున్నారు. 217 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 44 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్ పరీక్షకు 689 మంది రిజిస్టర్ చేసుకున్నారు. 597 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వీరిలో 92 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూయేల్ నాలుగు పరీక్ష కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ పది, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 3 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదని డీఈవో వివరించారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డీఈవో శామ్యూయేల్ తెలిపారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.7.81 లక్షలు

బేతంచెర్ల, జూన్ 8: మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలోని మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.7.81 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే గాక. తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.7,81,770 ఆదాయం దేవస్థానానికి లభించినట్లు వారు తెలిపారు.

రస్తాలో బోరు వేసిన వైసీపీ నాయకుడు

రుద్రవరం, జూన్ 8 : మండలంలోని టి. లింగందిన్నె గ్రామంలో వైసీపీ నాయకుడు వీరశేఖరరెడ్డి గవర్నమెంటు రస్తాలో బోరు వేసినట్లు సర్పంచ్ లక్ష్మీదేవి శనివారం రాత్రి తెలిపారు. ఈ విషయంపై రుద్రవరం ఎస్ఐ నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. గవర్నమెంటు రస్తాలో దౌర్జన్యంగా బోరు వేసి దేవునిమాన్యంలో పైపులైను ఏర్పాటు చేయించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్ఐని కోరారు.

వాటర్ హీటర్ షాక్‌తో మహిళ మృతి

కోసిగి, జూన్ 8: వాటర్ హీటర్ షాక్‌తో నాగజ్యోతి (36) అనే మహిళ మృతి చెందింది. ఈ ఘటన శనివారం కోసిగిలో జరిగింది. కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో సాయిబాబా దేవాలయం దగ్గర నివాసం ఉంటున్న ఏఎన్ఎం రాధ కుమారుడి పుట్టిన రోజు వేడుకలకు ఆమె చెల్లెలు నాగజ్యోతి అనంతపురం వచ్చింది. రాధ షాపింగ్ కోసం భర్త విజయ్‌తో కలిసి ఆదోనికి వెళ్లింది. నాగజ్యోతి బాత్‌రూమ్‌లో ఉన్న వాటర్ హీటర్ కరెంటు షాక్‌తో అక్కడే కుప్పకూలి పోయింది. చాలా సేపటి తర్వాత పక్కింటి వారు గుర్తించి ఆమెను కోసిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి 108 వాహనంలో ఆదోనికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించగా.. ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త కిరణ్, రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. ఆదోని అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాటుసారా ధ్వంసం

బేతంచెర్ల, జూన్ 8: బేతంచెర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన 32 కేసుల్లో 1020 లీటర్ల నాటుసారా, 5 ఎక్సైజ్ కేసుల్లో 750 ఎంఎల్ 96 వివిధ బ్రాండ్ల మద్యం ఫుల్ బాటిల్స్‌ను, 180 ఎంఎల్ 28 క్వార్టర్స్ బాటిల్స్‌ను శనివారం పోలీసులు ధ్వంసం చేశారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు సీఐ ప్రియతమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ శివశంకర్ నాయక్ సిబ్బందితో కలిసి పోలీస్‌స్టేషన్ వెనుక ప్రాంగణంలో ట్రాక్టర్ ద్వారా ధ్వంసం చేసినట్లు తెలిపారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

చాగలమర్రి, జూన్ 8: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, తల్లిదండ్రులు కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడి బడిబాట పిలుస్తోంది కార్యక్రమాన్ని చేశారు. 4, 15, 16, 17 అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించాలని కోరుతూ ప్రచారం చేశారు. 5 సంవత్సరాల లోపుగల చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఈనెల 12వ తేదీ వరకు అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు సంజీవమ్మ, పద్మావతి, నాగమణి, చంద్రకళ, ఆయాలు పాల్గొన్నారు.

కుందూలో పెరిగిన నీటి ఉధృతి

9 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం



చాగలమర్రి, జూన్ 8: మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద కుందూ వరద నీటితో ఉగ్రరూపం దాల్చింది. శనివారం ఎగువ నుంచి వరద నీరు ఆనకట్టకు చేరింది. కుందూనది వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆనకట్ట నుంచి కడప జిల్లావైపు 5 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. పక్కనే ఉన్న కేసీ కెనాల్ గేట్లను ముందస్తుగా మూసి వేశామని కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు కుందూ నది దాటే ప్రయత్నం చేయరాదని, మూగ జీవాలను తాగునీటి కోసం తీసుకెళ్లరాదని సూచించారు.

ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్

చాగలమర్రి, జూన్ 8: ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సంక్షేమమే ప్రభుత్వ బాధ్యతని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా తెలిపారు. శనివారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మస్తాన్‌బాషా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా ఎన్నికైన భూమా అఖిలప్రియ, రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడుతున్న నారా చంద్రబాబునాయుడుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ బకాయిల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని, ఐఆర్ ప్రకటించాలని, 117 జీవోను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం తేవాలని, మెగా డీఎస్సీ ప్రకటించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. సిఫారసు బదిలీలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు విడుదల కావడంపై హర్షం ప్రకటించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మాబు హుసేన్, ఎస్టీయూ సంఘ నాయకులు నారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గురు చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సీతారాములకు విశేష పూజలు

చాగలమర్రి, జూన్ 8: మండలంలోని చింతలచెరువు గ్రామంలో వైశాకమాసం సందర్భంగా వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సంవృద్ధిగా రావాలని కోరుతూ పూజలు చేశారు. అనంతరం సీతారాముల ఉత్సవమూర్తులచే పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. చాగలమర్రి గ్రామంలోని పట్టాభిరామ, వీరాంజనేయస్వామి ఆలయాల్లో ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు చారిత్రాత్మకం

శిరివెళ్ల, జూన్ 8 : రాష్ట్రంలో టీడీపీ గెలుపు ఎంతో చారిత్రాత్మకమైనదని బీసీ సంఘం, కురువ సంఘం నాయకుడు పీపీ లింగమయ్య



శిరివెళ్లలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అన్నారు. శిరివెళ్లలోని పసులపేటలో శనివారం మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలంటే ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలన్నారు. టీడీపీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. అనంతరం కురువ సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పసుల కృష్ణమూర్తి, సుధాకర్, తిరుపతి, నాగేంద్రుడు, పుల్లయ్య, నాగన్న, మణికంఠ, కురువ నాగరాజు, రామకృష్ణ, జనసేన పార్టీ మండల కన్వీనర్ పసుల నరేంద్ర పాల్గొన్నారు.

పాఠశాలలను శుభ్రం చేసుకోవాలి

ప్యాపిలి, జూన్ 8: త్వరలో పాఠశాలలు పునఃప్రారంభం కానునందున తరగతుల గదులను శుభ్రం చేసుకోవాలని మండల విద్యాధికారి వెంకటేష్‌నాయక్ సూచించారు. శనివారం ఆయన మండలంలోని గుడిపాడు ప్రాథమికోన్నత పాఠశాల గదులను ఆయన శుభ్రం చేయించారు. పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించమన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా తీసుకురండి

కోవెలకుంట్ల, జూన్ 8 : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అడిగి తీసుకురావాలని నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌కు నంద్యాల జిల్లా నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు దేవరాజ్ విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విభజన జరిగిన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనేక విధాలుగా నష్టపోయిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ ఏపీకి రాజధాని లేకుండా చేయడమే కాకుండా ప్రత్యేక హోదా తెప్పించడంలో పూర్తిగా విఫలమయాడన్నారు. అందువల్లనే ప్రజలు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పి టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి కూటమికి ప్రజలు ఓట్లు వేసి అత్యధిక స్థానాలు గెలిపించారని అన్నారు. కేంద్రంలో ఏర్పడబోయే ఎన్‌డీఏ ప్రభుత్వంతో మాట్లాడి ఏపీకి ప్రత్యేక హోదా తీసుకురావాలని ఆయన కోరారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

కోవెలకుంట్ల, జూన్ 8 : కోయిలకుంట్ల పట్టణంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. శనివారం మృగశిర కార్తె ప్రారంభం అయినందున నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో డాక్టర్ ఈశ్వరయ్య పాల్గొని ఉబ్బసం, ఆయాసం, దగ్గు, పడిశం వంటి వ్యాధులు గల సుమారు 40 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు డాక్టర్ బాలాంజయనేయరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన

పొంగిపొర్లిన వాగులు, వంకలు

బేతంచెర్ల, జూన్ 8 : మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వర్షపు నీటితో బోరుబావుల కింద వేసిన పంటలన్నీ మునిగాయి. ముసలాయ చెరువు గ్రామానికి వెళ్లే రోడ్డు బ్రిడ్జి దెబ్బతింది. వర్షాలకు భారీగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



నీట మునిగిన పంట పొలాలు



కోతకు గురైన ముసలాయ చెరువు రోడ్డు

వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి

బనగానపల్లె, జూన్ 8 : ఈనెల 10న సిద్ధేశ్వరం అలుగు 8వ వార్షికోత్సవం కార్యక్రమం కొత్తపల్లె మండలం సంగమేశ్వరం వద్ద నిర్వహిస్తున్నట్లు యాగంటి బసవేశ్వర రైతు సంఘం ప్రధాన కన్వీనర్ కొండారెడ్డి శనివారం తెలిపారు. బనగానపల్లెలో ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా విస్తృతస్థాయి ప్రజాసంఘాల సమావేశంలో రాయలసీమ అభివృద్ధి అంశాలపై నివేదికను రూపొందించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. ఈ వార్షికోత్సవానికి రైతులు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యాగంటి బసవేశ్వర రైతు సంఘం అధ్యక్షుడు మూలారెడ్డి, శివకృష్ణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త నాగార్జున మృతికి నివాళి

బనగానపల్లె , జూన్ 8 : బనగానపల్లె పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త నాగార్జున (28) మృతికి బనగానపల్లె టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ శనివారం నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

బీసీకి మంత్రి పదవి ఇవ్వాలి



ప్రార్థనలు చేస్తున్న పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, సయ్యద్‌హైదర్, టీడీపీ నేతలు

బనగానపల్లె , జూన్ 8 : ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి మంత్రిపదవి రావాలని టీడీపీ ప్రచార కార్యదర్శి సయ్యద్‌హైదర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు అన్వర్‌సాహెబ్, సయ్యద్‌హైదర్‌లతో కలసి పతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు కాశీంబాబు, అల్తాఫ్‌హుసేన్, అన్వర్‌సాహెబ్, మౌలాలి, అశ్వక్,మెకానిక్ బాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం

దొర్నిపాడు, జూన్ 8: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల లోపు చిన్నారులు అంగన్‌వాడీలకు పంపించాలని తల్లిదండ్రులను కోరుతూ గ్రామంలో ర్యాలీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతమ్మ ఆధ్వర్యంలో బడిబట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. 3, 6 కేంద్రాల్లోని చిన్నారులకు అక్షరాభ్యాసంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మంచి విద్యాబోదనను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వెంకటసుబ్బమ్మ, ఆయాలు ఉన్నారు.

డోన్‌లో వాల్మీకుల సంబరాలు

డోన్(రూరల్), జూన్ 8: రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనం సృష్టించడం, డోన్‌లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడంతో డోన్‌లో వాల్మీకులు శనివారం రాత్రి సంబరాలు చేసుకున్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులో వాల్మీకి సంఘం నేత కార్యాలయం వద్దకు చేరుకుని సంబరాలు చేసుకున్నారు. వాల్మీకి సంఘం నేత సీలం భాస్కర్‌నాయుడును వాల్మీకి సోదరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాతపేటకు చెందిన వాల్మీకి సోదరులు రాముడు, శేఖర్, మధు, వినోద్ పాల్గొన్నారు.

వర్గాల మధ్య ఘర్షణ

ఆళ్లగడ్డ, జూన్ 8: ఆళ్లగడ్డ పట్టణంలోని సద్దాంకాలనీలో నివాసముంటున్న రమీజబీ, మియ్యా వర్గాల మధ్య శనివారం రాత్రి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యర్రగుంట్ల ఎస్‌బీఐలో అగ్నిప్రమాదం

శిరివెళ్ల, జూన్ 8 : కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై శిరివెళ్ల మండలం యర్రగుంట్ల గ్రామంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో శనివారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రెండవ శనివారం కావడంతో అధికారులు బ్యాంకును మూసివేశారు. శనివారం రాత్రి బ్యాంకులో మంటలు చెలరేగడంతో స్థానికులు బ్యాంకు అధికారులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. బ్యాంకు వద్ద ఉన్న బోరు సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. బ్యాంకులోని కొన్ని దస్త్రాలు దగ్ధమైనట్లు సమాచారం. అగ్నిమాపక సిబ్బంది, శిరివెళ్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

అఖిలప్రియ గెలుపుపై అహోబిలానికి పాదయాత్ర



పాదయాత్ర ద్వారా అహోబిలం బయలుదేరి వెళ్తున్న టీడీపీ నాయకులు

ఉయ్యాలవాడ, జూన్ 8: ఆళ్లగడ్డ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా భూమా అఖిలప్రియ గెలుపొందడటంతో ఉయ్యాలవాడ మండల టీడీపీ కన్వీనర్ బోరెడ్డి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అహోబిలం క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. శనివారం పాదయాత్రగా బయలుదేరి వెళ్లి లక్ష్మీనరసింహస్వామి దర్శించుకొని మొక్కు చెల్లించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు బోరెడ్డి నర్సిరెడ్డి, దస్తగిరిరెడ్డి, కొర్రపాటి శివనారాయణరెడ్డి, భరతసింహారెడ్డి, రంజిత్‌రెడ్డి, ఆకుల వెంకటసుబ్బయ్య, కానాల నాగేశ్వరరెడ్డి, ఈడిగ పుల్లయ్య, శేఖర్, సునీల్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: టీడీపీ కూటమికి ఈ ఎన్నికల్లో 160 సీట్లు వస్తే అవుకు మండలం గుండ్లశింగవరం నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తానని మొక్కుకోవడంతో ఆ మొక్కులు చెల్లించడానికి శనివారం గుండ్లశింగవరం నుంచి టీడీపీ అభిమాని కొండారెడ్డి పాదయాత్రగా వెళ్లారు.

సైకో పాలన అంతమైంది

- ఆలయాల్లో మొక్కులు తీర్చుకున్న మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు కుటుంబ సభ్యులు, తదితరులు

డోన్(రూరల్), జూన్ 8: రాష్ట్రంలో సైకో పాలన అంతమైందని డోన్ టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు అన్నారు. మండలంలోని ఆవులదొడ్డి గ్రామ సమీపంలో ఉన్న లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా 12న ప్రమాణ స్వీకారం చేస్తుండడం, డోన్‌లో టీడీపీ ఘన విజయం సాధించడంతో శనివారం కుటుంబ సభ్యులతో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఆలయ ధర్మకర్త జనసేన నియోజకవర్గ నాయకులు ఆలా మోహన్ రెడ్డి, టీడీపీ నాయకులు ఉన్నారు.

మాజీ ఎంపీపీకి సన్మానం



సోమశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బేతంచెర్ల, జూన్ 8 : డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలుపు కోసం కృషి చేసినందుకు టీడీపీ మాజీ ఎంపీపీ, సీనియర్ టీడీపీ నాయకుడు సోమశేఖర్ రెడ్డిని గూటుపల్లె టీడీపీ నాయకులు ముల్లా, ఎంఎస్ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. శనివారం సాయంత్రం పట్టణంలోని వెంకటేశ్వర సినిమా థియేటర్ ప్రాంగణంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామసుబ్బారెడ్డి, గుటుపల్లె, హుశేనాపురం టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామోజీ మరణం తీరని లోటు



ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జూన్ 8: రామోజీ గ్రూపుల సంస్థల అధినేత రామోజీరావు మరణం తీరని లోటని బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం రామోజీ మరణ వార్త విని తీవ్రదిగ్భ్రాంతికి గురైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు నేల, తెలుగు అక్షరం ఉన్నంతకాలం ఆయనపేరు చిరస్థాయిగా ఉంటుందని, రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంపాపం వ్యక్తం చేశారు.

- రామోజీరావు మృతి తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజరెడ్డి అన్నారు. స్థానిక గుర్రెడ్డి కాంప్లెక్స్‌లోని బసీరాజారెడ్డి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. కార్యక్రమంలో శరత్‌కుమార్‌రెడ్డి, కైపరఘునాథరెడ్డి, కాశీంబాషా, పూలకలాం, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

డోన్: రామోజీరావు మృతికి శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, మాజీ సర్పంచ్ టీఈ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ తదితరుల ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్ఎండీ రఫి, తాడూరు వెంకటరమణయ్య, గోవిందరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఖాజా, రవి, తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయంలో రామోజీరావు మృతికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, ధర్మవరం చిన్న నాగిరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రజా వైద్యశాల మల్లికార్జున, ఆలా మల్లికార్జున రెడ్డి, ధర్మవరం గౌతమ్ రెడ్డి, చక్రపాణి గౌడు, హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

శిరివెళ్ల: రామోజీరావు మృతికి మండలంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం సంతాపం వ్యక్తం చేశారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, ఫిదా హుసేన్, మోహన్‌రెడ్డి, మురళి, బాలచంద్రుడు, రవి, సిద్దిఖ్, బీఎండీ రఫి, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసరెడ్డి, పీపీ లింగమయ్య, మస్తాన్, కరీం, జయరామిరెడ్డి, శీలం ప్రసాద్ పాల్గొన్నారు.

- రామోజీరావు మరణవార్త తనను ఎంతగానో కలిచివేసిందని ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ అన్నారు. ఎంతోమందికి రోల్‌మోడల్‌గా నిలిచిన వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందారన్న వార్త విని దిగ్భ్రాంతికి గురైనట్లు సోషల్‌మీడియాలో భాగమైన ఫేస్‌బుక్‌లో పోస్టు చేసి సంతాపం వ్యక్తం చేశారు. వినూత్న వ్యవస్థాపకుడు, శ్రద్ధగల పారిశ్రామికవేత్త, విప్లవాత్మక ఆలోచనలు కలిగిన రామోజీరావుతో ఇటీవలే రెండు గంటల పాటు సంభాషించిన అనుభూతిని తాను ఎప్పటికీ మరచిపోలేనని తానా అధ్యక్షుడు నిరంజన్ వ్యక్తపరిచారు.

ఉయ్యాలవాడ: ఈనాడు దినపత్రిక అధినేత రామోజీరావు మృతికి మండల టీడీపీ నాయకుల నివాళి అర్పించారు. శనివారం స్థానిక బస్టాండ్ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మండల టీడీపీ కన్వీనర్ కూడాల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రియా పచ్చళ్లతో మొదలైన రామోజీ ప్రస్థానం ఎంతో ఒడిదుడుకుల మధ్య సాగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుల వెంకటసుబ్బయ్య, అర్జిగారి నరసింహుడు, దూదేకుల బాలుడు తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలో రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోరెడ్డి చిన్నపురెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, అందెరాము, డిష్ గోపాల్, టైలర్ రాముడు, మల్లికార్జున యాదవ్, భాష, గోపాల్, నారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: రామోజీరావు అస్తమయం కావడం చాలా బాధాకరమని కొండాపురం మాజీ సొసైటీ అధ్యక్షుడు బొబ్బూరి వెంకటస్వామి అన్నారు. శనివారం రామచంద్రాపురం గ్రామంలో ఆయన స్వగృహం వద్ద రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ

ఆళ్లగడ్డ: రామోజీరావు తెలుగు బాషాభివృద్ధి చేసిన కృషి మరువలేనిదని నంద్యాల జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అధ్యక్షుడు అమీర్ బాషా అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఉన్న గాంధీజీ విగ్రహం వద్ద రామోజీరావు చిత్రపటానికి శనివారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ రామోజీరావు మృతికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పత్రికారంగానికి చేసిన సేవ మరువలేనిదని కొనియాడారు.
- రామోజీరావు మృతి తీరని లోటని జనసేన పార్టీ ఇన్‌చార్జీ ఇరిగెల రాంపుల్లారెడ్డి. సూర్యనారాయణరెడ్డి శనివారం అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.
- ఆళ్లగడ్డ మండలంలోని మర్రిపల్లె గ్రామస్తులు ఈనాడు అధినేత దివంగత రామోజీరావుకు శనివారం ఘనంగా నివాళీ అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు నర్సిరెడ్డి, పత్తిపాపిరెడ్డి, విజయభాస్కరరెడ్డి, గంగాధర్, సానే శేఖర్, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం రామోజీరావుకు ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, ఖాజాపీర్, ఎస్ మధు, కలచట్ల ప్రసాద్, మామిళ్లపల్లి శ్రీను, ఎస్‌కే వలి పాల్గొన్నారు.

రుద్రవరం: రామోజీరావు మృతికి రుద్రవరంలో టీడీపీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలోరంగనాయకులు, ఏరువ క్రిష్ణమూర్తి, నంద్యాల పార్లమెంటు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమలపాటి రాజారావు, శేఖర్, దస్తగిరి, పౌలు, గురప్ప తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: రామోజీరావు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం పట్టణంలోని పాతబస్టాండులో రామోజీరావు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, మండల టీడీపీ సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, పట్టణ టీడీపీ సమన్వయ చైర్మన్ సుధాకర్, తిరుమలేష్ చౌదరి, నారాయణ స్వామి, వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చాగలమర్రి: రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరని లోటని రాష్ట్ర టీడీపీ మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ముత్యాలపాడు, తోడెండ్లపల్లె, కొత్తపల్లె తదితర గ్రామాల్లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో రామోజీరావు మృతికి సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రామసుబ్బయ్య, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, మౌలాలి, అనిఫ్, జెట్టి నాగరాజు, అజీమ్, గఫార్, శ్యాబుల్, కరిముల్లా, నరసింహారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉసేన్‌రెడ్డి, రామ్మోహన్, గోపాల్, సురేష్‌కుమార్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పయాజ్, బషీర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఎస్ఆర్ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి



చాగలమర్రి టీడీపీ కార్యాలయంలో...



కొలిమిగుండ్లలో...



శిరివెళ్లలో...



బేతంచెర్లలో...



ఆళ్లగడ్డ పట్టణంలో..



దొర్నిపాడులో..



బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో...



ప్యాపిలిలో...



రుద్రవరంలో...